అంతా గత వైభవమే!

ఆ వార్డుకు గత ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. 2019 ముందు వరకూ కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూపురేఖలు మారిపోయాయి. సకల వసతులు సమకూరాయి. వైద్యం చేరువైంది. రోడ్లు.. తాగునీటి పైప్‌లైన్లు వచ్చాయి. దీంతో వార్డు ప్రజలు హాయిగా జీవనం సాగిస్తున్నారు. కళ్ల ముందు అభివృద్ధి **కనిపించడంతో ఇదంతా గత ప్రభుత్వ చలువేనని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

– సింధియా


యారాడ మార్గంలో నిర్మించిన రోడ్డు

వార్డులో పలు అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వివరాలు

- ఏకేసీకాలనీలో సుమారు రూ. 96 లక్షలతో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు.
- రాజీవ్‌కాలనీలో అండర్ గ్రౌండ్ వాటర్ సప్‌లై కోసం రూ.10 లక్షలు
- వాంబే గృహాల మధ్యలో యూజీడీ అండర్ గ్రౌండ్ పైపులైను సిమెంట్ ప్లాట్‌ఫారం కోసం రూ. 40 లక్షలు
- వాంబే గృహాల మరమ్మతులు, పెయింటింగ్ కోసం రూ. 40 లక్షలు
- రూ.60 లక్షలతో మెయిన్‌రోడ్డు నుంచి హనుమాన్ టెంపుల్ వరకు మెయిన్ డ్రైన్ నిర్మాణం
- రాజీవ్‌కాలనీ దారిలో బ్రిడ్జి కోసం వెచ్చిన నిధులు రూ.12 లక్షలు
- హనుమాన్ టెంపుల్ నుంచి బ్లాక్ ఆయిల్ కంపెనీ వరకు మెయిన్ డ్రైన్ కోసం వెచ్చిన నిధులు రూ. 40 లక్షలు
- ఆస్పత్రి చుట్టూ రోడ్డు కోసం వెచ్చిన నిధులు రూ.12 లక్షలు
- నూకాంబిక అమ్మవారి గుడి వద్ద రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షలు
- షిప్‌యార్డ్‌కాలనీలో శివాలయం వరకు వేసిన రోడ్ల కోసం రూ. 40 లక్షలు
- టెలిఫోన్ కార్యాలయం గోడ పక్క నుంచి కల్వర్టు, రహదారి నిర్మాణానికి రూ.19 లక్షలు
- రూ.38 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 18 లక్షలు
- హడ్కో రౌండ్ బిల్డింగుల మరమ్మతుల కొరకు వెచ్చించిన నిధులు రూ.19 లక్షలు
- కల్యాణ మండపంలో మిగిలిన పనుల కోసం రూ. 19 లక్షలు
- యారాడ ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులు రూ.3.50 కోట్లు.

ఇలా జీవీఎంసీ 40వ వార్డులో రూ. 8.63 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించారు. వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు కృషితో వార్డు అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని భవిష్యత్తులో కూడా హాయిగా జీవనం సాగించవచ్చునని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


40వ వార్డులో నిర్మించిన ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ



40వ వార్డులో రూ. 90లక్షలతో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ

రూ.8.63 కోట్లతో అభివృద్ధి పనులు

40వ వార్డు ప్రజలకు సమకూరిన వసతులు

రోడ్ల నిర్మాణంతో పర్యాటకులకు తప్పిన ఇక్కట్లు

వెనుక బడిన వార్డులో వసతులు కల్పించాలన్న 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రయత్నానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారం తోడైంది. భారీగా నిధులు మంజూరయ్యాయి. దీంతో చకచకా అభివృద్ధి పనులు పూర్తి చేశారు. షిప్‌యార్డ్ కాలనీ, సింధియాన్యూకాలనీ, ఏకేసీకాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, గృహసముదాయాల్లో మౌలిక వసతులు కల్పించారు. యారాడ వెళ్లే మార్గం రక్షణ గోడలు లేక భయానకంగా ఉండేది. దీంతో పర్యాటకులు ఆ మార్గంలో వెళ్లాలంటే భయపడేవారు. రూ. 40 లక్షలతో రక్షణ గోడలు, రోడ్లు నిర్మించడంతో ఇబ్బందులకు తెరపడిందని ప్రజలు, పర్యాటకులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

రోడ్ల నిర్మాణం అద్భుతం



ఏకేసీకాలనీలో రోడ్లు లేక అవస్థలు పడేవారం. ప్రయాణం చేయలేక చాలా ఇబ్బందులు పడ్డాం. అలాంటి మా ప్రాంతంలో గత ప్రభుత్వంలో రోడ్లు వేశారు. అప్పటి నుంచి హాయిగా ప్రయాణిస్తున్నాం.
– రాజారావు, మల్కాపురం

యారాడ అంటే భయమేసేది



నేను చేపల వ్యాపారం చేస్తాను. గతంలో యారాడ వెళ్లాలంటే చాలా భయపడేవాళ్లం. ఆటోలు కూడా వెళ్లేవి కావు. రక్షణ గోడలు లేక, రోడ్లు గుంతలు పడి చాలా అధ్వానంగా ఉండేవి. ఇప్పుడు రోడ్లు, రక్షణ గోడలు చక్కగా నిర్మించడంతో ఏ భయం లేకుండా ప్రయాణిస్తున్నాం. పర్యాటకుల తాకిడి కూడా పెరిగింది. – కృష్ణవేణి, చేపల వ్యాపారి, మల్కాపురం

క్లుప్తంగా

ఘనంగా మహిళా దినోత్సవం


మహిళలను సత్కరిస్తున్న జనతా కాలనీ మహిళా సేవా సంఘం సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు విమల మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. ఇందుకు తమ మహిళా సేవా సంఘమే ఒక ఉదాహరణ అని తెలిపారు. మహిళా సేవా సంఘ అభివృద్ధికి కృషి చేసిన బలివాడ రమాకుమారి, సింహ లక్ష్మిలను ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ మహిళలు సామాజిక చైతన్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు బొజ్జ వెంకటలక్ష్మి, దాసరి శివ లక్ష్మి, సత్యవతి, అరుణ కుమారి, జ్యోతిప్రభ, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ కార్మికులకు వంద శాతం బీమా

- సీఎండీ హేమంత్ ఖత్రి
- రెస్క్యూ 2.0 ఆవిష్కరణ


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: షిప్‌యార్డ్‌లో పనిచేసే ప్రతి కార్మికునికి ఏప్రిల్ నుంచి 100 శాతం బీమా కవరేజీ ఉంటుందని సంస్థ సీఎండీ హేమంత్‌ఖత్రి ప్రకటించారు. షిప్‌యార్డ్‌లో ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు సైతం చిన్న చిన్న గాయాలు కూడా నిరోధించడానికి రెస్క్యూ 2.0 కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో మంగళవారం నిర్వహించిన 54వ జాతీయ భద్రతా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజువారీ జీవితంలో ఆరోగ్యంతో పాటు రోడ్డు భద్రత, పర్యావరణ భద్రత ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించారు. ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ అశోక్‌కుమార్ ఉద్యోగులందరి చేత భద్రతా ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం విద్యార్థులకు, ఉద్యోగులకు వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి నేడు కృత్తిక పూజలు

కంచరపాలెం : కంచరపాలెం ఊర్వశి జంక్షన్ సమీప రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో బుధవారం శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్చకులు రామకృష్ణశర్మ నేతృత్వంలో మంగళవారం పంచమి పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం జరిగే కృత్తిక పూజల్లో పాల్గొనే భక్తులు ఆలయానికి ఉదయం 8 గంటలకే చేరుకోవాలని దేవాల రాజు కోరారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

సీతమ్మధార: కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్లకు కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకత్వంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుశారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చినా అమలు చేయని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని, బేసిక్ వేతనంతో పాటు డీఏ, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులు, కుటుంబానికి మెడికల్ అలవెన్సులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ దృష్టికి న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా పరిష్కరించమని కోరుతామన్నారు. నిరసనలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అత్యుతరావు, మన్మథరావు, మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి జేడీ నాయుడు, రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ అంబలం పూజ


ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు


అంబలం పూజలో భవానీ భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి రామూర్తిపంతులుపేటలో పైడిమాంబ ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 11న ప్రధాన ఉత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం గౌరీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మహాత్మగాంధీ కళా సమితి ప్రాంగణంలో పైడిమాంబ అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారిని అధిష్టంపజేసి ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. రాత్రికి భవానీ మాలధారణ భక్తులు, స్థానికులు అంబలం పూజ నిర్వహించారు. గ్రామకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన


న్యాయమూర్తి ఆనందికి మొక్క అందిస్తున్న విద్యార్థినులు


న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గోపాలపట్నం: బాలలపై అత్యాచారాలను నిరోధించడానికి ఉద్దేశించిన పోక్సో చట్టంపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, న్యాయ సంఘాలపై ఉందని జిల్లా న్యాయమూర్తి ఆనంది పేర్కొన్నారు. గోపాలపట్నం బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో 'లైంగిక నేరాలు.. ఆడపిల్లల సంరక్షణ'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ తదితర అంశాల గురించి తెలియజేశారు. బాలికలతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు గురి చేసినా అటువంటి వారిపై పోక్సో కేసు నమోదు చేస్తే, విధించే శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని తెలిపారు. పిల్లలను రక్షించడానికి రూపొందించిన పలు చట్టాల గురించి విశాఖపట్నం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ అప్పారావు, సీడబ్ల్యూసీ సభ్యురాలు రమణకుమారి, సీడీపీవో కె.వి.లక్ష్మి తదితరులు వివరించారు. అనంతరం అతిథులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్


హాజరైన అధికారులు, సిబ్బంది

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధ నేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పరిపాలన విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వీసీగా నియమితులు కావడం ఎంతో అభినందనీయమన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి

మురళీనగర్ : భద్రత కేవలం నిబంధన కాదని... సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి అన్నారు. విశాఖపట్నం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరంతర విద్య, భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. ప్రజల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వేవ్స్ - 2025 సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఛాలెంజ్‌లలో విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించాలన్నారు. ఎన్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, పరాక్రమ అవార్డు గ్రహీత డాక్టర్ జీపీఆర్ కృష్ణ భద్రతా చర్యల ప్రాముఖ్యత, నిత్య జీవితంలో పాటించాల్సిన నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ''తల్లిపేరుతో ఒక మొక్క'' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సీబీసీ సంగీత నాటక విభాగం కళాకారులు భద్రత ప్రాముఖ్యతపై తెలుగు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీరామమూర్తి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నారాయణరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన సెయింట్ జోసెఫ్ సిబ్బంది

కంచరపాలెం: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను మంగళవారం జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఆధ్యాపక సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ మేరీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, నాన్సీ, దీపాలి, డాక్టర్ సుధ, డాక్టర్ పి.అరుణ, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ జియ్యాని విస్తృత పర్యటన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని గ్రీన్‌బెల్ట్, వాకింగ్ ట్రాకుల్లో మంగళవారం అధికారులతో కలసి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. కరాస హిందూ-ముస్లిం-క్రైస్తవ శ్మశాన వాటికలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మర్రిపాలెం వుడా లేఅవుట్ ప్రాంతంలో పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు, వాటర్ సప్లై పనుల పురోగతిపై కాంట్రాక్టర్లతో చర్చించారు.అనంతరం నవ్యాంధ్ర స్కూల్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ వాకింగ్ ట్రాక్‌లో జిమ్ పరికరాలతో పాటు కల్పించాల్సిన మౌలిక సదుపాయలపై చర్చించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా


రామాటాకీస్ కూడలిలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట : ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ధర్నాలో భాగంగా రామటాకీస్ కూడలి వద్ద మంగళవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అధిక జరిమానాలకు కారణమవుతున్న 21, 31 జీవోలను రద్దు చేయాలని, డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసినట్టుగానే వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారని, భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్‌టాక్స్, గ్రీన్ టాక్స్, టోల్‌ప్లాజా ఫీజులను 30 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు యు.శివాజీ, రావికృష్ణ, దేవుడు, ఈశ్వర్, ఎస్.అప్పలరాజు, టి.రవి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవికి బంగారు పతకం

అభినందించిన ఏయూ వీసీ


పల్లవిని అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన వర్సిటీ విద్యార్థిని పల్లవిని వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలు సెంట్రల్ యూనివర్సిటీ ధర్మశాలలో ఇటీవల జరిగాయి. ఈపోటీల్లో ఆంధ్రాయూనివర్సిటీ తరఫున పాల్గొన్న క్రీడాకారులు పతకాలు సాధించారు. 71 కిలోల విభాగంలో ఎస్. పల్లవికి గోల్డ్ మెడల్, 76 కిలోల విభాగంలో బి. జాన్సీ బ్రాంజ్ మెడల్ సాధించారు. అలాగే కేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో 71 కిలోల విభాగంలో ఎస్. పల్లవికి సిల్వర్ మెడల్, సీహెచ్ శ్రీలక్ష్మి 87కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు మంగళవారం వీసీని కలిశారు. స్పోర్ట్స్ డైరెక్టర్ ఆచార్య విజయ మోహన్ విద్యార్థుల సాధించిన క్రీడా ప్రతిభ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, డాక్టర్ ఎల్‌బీ కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై. శ్రీనివాసరావు క్రీడాకారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వదిలేశారు!


నిర్మాణం పూర్తయినా తొలగించని వ్యర్థాలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో దుర్గానగర్ వద్ద నిర్మించిన వంతెన పనులు పూర్తి చేశారు. ఈ నిర్మాణ పనుల కోసం రెండు నెలలుగా ప్రధాన రహదారి మూసివేశారు. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పారిశుధ్య సిబ్బంది చెత్త చెదారాలు తొలగించడానికి, క్లాప్ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయి నెల రోజులు గడిచినా తొలగించలేదు. దీంతో మరిన్ని ఇబ్బందులు వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి వంతెన రహదారికి మోక్షం కలిగించాలని కోరుతున్నారు.